సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



కేసీఆర్ కానుక.. ఎప్పడిక?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రవేశపెట్టిన కేసీఆర్ కానుక అందని ద్రాక్షగా మారింది.

8లో



నేటి నుంచి క్రీడాపోటీలు

కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో బుధవారం నుంచి కార్పొరేట్ ఏరియా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రికి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెరుగుతూ, తగ్గుతున్న గోదావరి!



భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద చేరుతుండగా, భద్రాచలం వద్ద వారం రోజుల నుంచి గోదావరి నీటిమట్టం తరచుగా పెరుగుతూ, అప్పుడప్పుడు తగ్గుతూ దోబుచులాడుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న ఔట్‌ఫ్లో కారణంగా ఈనెల 17 నుంచి పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 36.8 అడుగుల వద్ద నిలకడగా ఉండి రాత్రి 8గంటలకు 35.6 అడుగులకు పడిపోయింది. అయితే, ఎగువ నుంచి వచ్చే వరద తగ్గుతుండడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం కూడా క్రమంగా తగ్గనుందని అధికారులు వెల్లడించారు.

పర్యావరణహితంగా పండుగలు చేసుకోవాలి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మొహంతి

బూర్గంపాడు: పర్యావరణహితంగా పండుగలు చేసుకోవాలని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్దార్థ మొహంతి అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో వినాయకుడి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకునేందుకే పూర్వీకులు పండుగలకు కొన్ని ప్రత్యేక సంప్రదాయాలు, ఆచారాలను ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జయంత్‌కుమార్ దాస్, కేవీఎస్ గోవిందరావు, సమంత ప్రఫుల్, శివరాం కృష్ణన్, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ వివరాలకు పోర్టల్ ఏర్పాటు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులు, అధికారులు సీఎంపీఎఫ్ డబ్బుల వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు వీలుగా పోర్టల్ ఏర్పాటు చేసినట్లు పర్సనల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికులు, అధికారులు తమ ఖాతా వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, ఏమైనా తేడాలుంటే rao1974@cmpfo.gov.in, grievance @ cmpfo. gov.in మెయిల్ అడ్రస్‌కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. తద్వారా సీఎంపీఎఫ్ అధికారులు ఆ సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉద్యోగులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. కాగా, సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు ఈనెల 21న ఉదయం 10 గంటలకు సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామని, హాజరైన వారికే సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

ముహూర్తం ఎప్పుడో?



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

ఊసే లేని ఐటీడీఏ పాలకమండలి సమావేశం

- పూర్తి కావొస్తున్న ప్రజాప్రతినిధుల పదవీ కాలం
- గిరిజనుల సమస్యలపై చర్చించడంలో ఇంత నిర్లక్ష్యమా..
- సత్వరమే సమావేశం ఏర్పాటు చేయాలంటున్న సంఘాల నేతలు

భద్రాచలం: గిరిజనుల సమస్యలపై చర్చించి వారి అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలు, ప్రగతి నివేదికలపై నిర్ణయం తీసుకోవాల్సిన ఐటీడీఏ పాలకమండలి సమావేశానికి ముహూర్తం దొరకడం లేదు. ఏడాదికి నాలుగు సార్లు జరగాల్సిన ఈ సమావేశంపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొద్ది కాలంలో ఎన్నికలు జరగనుండగా ప్రస్తుత ప్రజాప్రతినిధుల పదవీ కాలం గడువు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పాలకమండలి సభ్యుల సమక్షంలోనే సమావేశం నిర్వహించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆది నుంచీ అదే నిర్లక్ష్యం..

గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, ఏడాదికి ఒక్కసారి కూడా జరపడం లేదు. 2019లో ఓసారి సమావేశం నిర్వహించగా మూడేళ్ల తర్వాత గతేడాది జూలై 8న మరో సమావేశం జరిగింది. చివరి సమావేశం ముగిసి 14 నెలలు గడిచినా మళ్లీ నిర్వహణకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో భద్రాద్రి జిల్లాలో 23, ఖమ్మం జిల్లాలో 5, ములుగు జిల్లాలో రెండు, మహబూబాబాద్ జిల్లాలో రెండు.. మొత్తం 32 మండలాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే లెక్కల ప్రకారం ఈ 32 మండలాల్లో గిరిజనులు 5,63,274 మంది ఉన్నారు. వీరిలో లంబాడాలు 2,14,787 మంది, కోయ 2,87,944, ఎరుకల 5,399, కొండరెడ్లు 1,422, యానాది 964, నాయకపోడు తెగ వారు 27,862, ఇతర ఎస్టీ కులాల వారు 24,896 మంది ఉన్నారు. వారి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేయాల్సిన జనరల్ బాడీ సమావేశ నిర్వహణలో మొదటి నుంచీ అధికారులు అలసత్వమే వహిస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదవీకాలం ముగిస్తే ఇంకా జాప్యమే

ఐటీడీఏలో జరిగే ఈ సమావేశానికి ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత ప్రజాప్రతినిధుల(ఎమ్మెల్యేలు) పదవీ కాలం త్వరలోనే ముగిసి ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పాలకమండలి సమావేశం జరుగుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా జాప్యం చేయకుండా తక్షణమే ఐటీడీఏ సమావేశం నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఐటీడీఏ అలంకార ప్రాయంగా మారిందని, సమావేశాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే అపవాదును అధికారులు ఇప్పటికే మూటగట్టుకున్నారు. పాలకమండలికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో నూతన కలెక్టర్ ప్రియాంక ఆల, పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్‌జైన్ చొరవ తీసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

గిరిజనులపై నిర్లక్ష్యానికి ఇదే సాక్ష్యం



గిరిజనులపై ప్రభుత్వానికి, అధికారులకు ఉన్న నిర్లక్ష్య తీరుకు ఇది నిదర్శనం. మూడు నెలలకు ఒకమారు జరపాల్సిన సమావేశాన్ని సంవత్సరాల తరబడి జాప్యం చేస్తుండడం అమానుషం. తూతు మంత్రంగా కాకుండా గిరిజన బిడ్డలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే

గిరిజన సంఘాల సమక్షంలో చర్చించాలి



ప్రతిసారి పాలక మండలి సమావేశానికి గిరిజన సంఘాల నాయకులను ఆహ్వానించడం లేదు. గిరిజనుల సమస్యలు ఏంటనేది వాటి పరిష్కారానికి నిత్యం పోరాడే నాయకులకు కొంత అవగాహన ఉంటుంది. వీరి సేవలను వినియోగించుకుంటే గిరిజనులకు మరింత న్యాయం జరుగుతుంది.

– ముర్ల రమేష్, ఆదివాసీ సంఘ నాయకుడు

బీఆర్‌ఎస్‌లో చేరిన కోనేరు చిన్ని

ఆహ్వానించిన మంత్రులు కేటీఆర్, పువ్వాడ



చిన్నితో కరచాలనం చేస్తున్న కేటీఆర్, పక్కన మంత్రి పువ్వాడ, విప్ రేగా

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కోనేరు సత్యనారాయణ(చిన్ని) మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిన్నితోపాటు ఆయన సోదరుడు కోనేరు పూర్ణచందర్‌రావు, కోనేరు వర్గీయులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు కార్ల ర్యాలీతో కోనేరు చిన్ని తెలంగాణ భవన్‌కు వెళ్లారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, భద్రాచలం, వైరా నియోజక వర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులు తెల్లం వెంకట్రావ్, మదన్‌లాల్ పాల్గొన్నారు. కాగా, చిన్ని చేరిక సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.



సెల్ఫీ విత్ గణేష్

పర్యావరణ పరిరక్షణలో మీరు భాగమై మట్టి గణేషుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా? జిల్లాలోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిమను ఏర్పాటుచేశారా? అయితే, మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి' పాఠకులతో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల్లోని విగ్రహాలతో సెల్ఫీ దిగి వాట్సప్ చేయండి. మీ పేరు, చిరునామా స్పష్టంగా ఉండాలి. మాకు అందిన ఫొటోల్లో ఎంపిక చేసిన వాటిని ప్రచురిస్తాం.

వాట్సప్ చేయాల్సిన నంబర్ :

80080 91951

పొర్లుదండాలతో నిరసన

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన



పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట పొర్లు దండాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పని భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాల అమలులో అంగన్‌వాడీలే కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గోనె మణి, ప్రమీల, రూప, సరోజ, విజయమ్మ, లలిత, కె. నాగమణి, పద్మావతి, సుశీల, రజిత, జమున పాల్గొన్నారు.

'గ్యారంటీ'లను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మణిపూర్ పీసీసీ అధ్యక్షుడు మేగేంధర్ సింగ్



మేగేంధర్ సింగ్‌తో కరచాలనం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మణిపూర్ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేగేంధర్ సింగ్ కోరారు. ఇల్లెందులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ అభయాస్తం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు రక్తతర్పణం చేస్తున్న యువతను చూసి చలించిన సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, నేడు అదే తెలంగాణలో ప్రజల కష్టాలు కళ్లారా చూసి ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు రూపకల్పన చేశారని చెప్పారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, నాయకులు చీమల వెంకటేశ్వర్లు, భూక్యా దళ్‌సింగ్ నాయక్, డాక్టర్ జి. రవి, డాక్టర్ బి.రాంచందర్ నాయక్, కామేపల్లి జెడ్పీటీసీ వెంకటప్రవీణ్‌నాయక్, ఆరెం పాపారావు, అజ్మీర శంకర్ నాయక్, డానియేల్, సైదులు, ముసలయ్య, దేవా నాయక్, కౌన్సిలర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పాత పాల్వంచలో పూజలు చేస్తున్న భక్తులు



వాడవాడలా వేడుకలు..

9లో

జిల్లాలో వినాయకచవితి వేడుకలు అంబరాన్నంటాయి. వాడవాడనా కొలువుదీరిన గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. భక్తులు తమ ఇష్టదైవమైన గణపతిని ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించి ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. పర్యావరణ హితం కోసం మట్టి గణపతులనే పెట్టాలని అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు ఎంతోకాలంగా ప్రచారం చేస్తున్నా.. జిల్లాలో పీఓపీ విగ్రహాలే ఎక్కువగా దర్శనమిచ్చాయి.

పారిశుద్ధ్య చర్యలపై శ్రద్ధ పెట్టండి



గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక, పీఓ ప్రతీక్ జైన్ తదితరులు

- గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో లోటు రావొద్దు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

భద్రాచలంఅర్బన్: పారిశుద్ధ్య చర్యలపై భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. గోదావరి నదిలో గణేశ్ నిమజ్జనానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. గణేశ్ నిమజ్జన ప్రదేశాలను ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌తో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మనుబోతుల చెరువు వద్ద ఉన్న చెత్తను త్వరగా శుభ్రం చేయాలని పంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లును ఆదేశించారు. మూడో రోజు నుంచే వినాయక ప్రతిమలు గోదావరిలో నిమజ్జనం చేయడానికి భక్తులు వస్తారని, వారి కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చివరి రోజు చాలా మంది వచ్చే అవకాశం ఉందని, నిమజ్జనం చేసే చోట బారికేడ్లు నిర్మించాలని, క్రేన్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రెండు వేర్వేరు రోడ్లను సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో భద్రాచలం ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఆర్డీఓ మంగీలాల్, ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

గతేడాది డబ్బులు ఇప్పించండి

గత ఏడాది వరద సమయంలో విధులు నిర్వహించిన తమకు ఇవ్వాల్సిన డబ్బులు నేటికీ అందలేదని, వాటిని ఇప్పించాలని గజ ఈతగాళ్లు కలెక్టర్ ప్రియాంక ఆలను కోరారు. అయితే గతంలో జరిగిన పనుల గురించి తనకు ఏ సమాచారం లేదని, ఈ ఏడాది వినాయక నిమజ్జన సమయంలో చేసే పనికి సకాలంలో డబ్బు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే బడ్జెట్‌ను సంబంధిత అధికారులకు అందజేశామని తెలిపారు.

32 గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ టవర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో సెల్ సిగ్నల్ లేని 32 గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ టవర్లు నిర్మించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సెల్ టవర్లు అవసరమైన గ్రామాల్లో 2 గుంటల భూమి కేటాయించాలని అధికారులు కలెక్టర్‌ను కోరగా.. సెల్, ఇంటర్నెట్ సేవలు ప్రజలకు చాలా అవసరమని, టవర్ల నిర్మాణానికి భూమి కేటాయిస్తామని చెప్పారు. 26 గ్రామాల్లో రెవెన్యూ ఆధీనంలో ఉన్న భూమి ఇస్తామని, మరో ఆరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం నవీన, ఏజీఎం శ్రీనివాసరావు, ఎస్‌డీఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సంకటం

- పంటల పెట్టుబడులకు రైతుల అవస్థలు
- రుణాల కోసం అన్నదాతల పడిగాపులు
- పాతవి మాఫీ అయినా అందని కొత్త రుణాలు



బూర్గంపాడు మండలంలో సాగు చేసిన పత్తి పంట

బూర్గంపాడు: పంటల సాగు పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటుతున్నా పంట రుణాలు ఇవ్వడంలో కుంటి సాకులు చెబుతూ బ్యాంకర్లు జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులకు కూడా తిరిగి అప్పులు ఇచ్చేందుకు కొర్రీలు పెడుతున్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే పంట రుణాలు అందాయి. సాగుకు పెట్టుబడి ఖర్చులు లేక రైతులు రుణాల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో రూ.2,300 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే పంటల సాగు పూర్తయ్యే నాటికైనా అందులో సగానికి కూడా చేరువయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

4.55 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 4.55 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా పత్తి, వరి, మిర్చి పంటలు వేశారు. పంటల పెట్టుబడి కోసం ప్రభుత్వం వానాకాలం సీజన్‌లో ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుబంధు సాయం అందించింది. అయితే సాగులో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడడంతో రెండు విడతలుగా పత్తి గింజలు వేయాల్సి వచ్చింది. గోదావరి వరదలతో కొంతమేర పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతుబంధు డబ్బు తొలిదశలోనే ఖర్చయ్యాయి. ప్రస్తుతం పత్తికి ఎరువులు, పురుగుమందులు వేయాల్సిన సమయంలో పెట్టుబడి డబ్బు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక వరినాట్లు వేసిన రైతులు ఎరువులు అవసరమైన ఈ సమయంలో ఆర్థికంగా అగచాట్లు పడుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేసినా బ్యాంకులు తిరిగి అప్పులు ఇవ్వకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణాలు ఇవ్వకపోగా రైతుబంధు, పంటలు అమ్ముకోగా వచ్చిన నగదును పాత బాకీ కింద జమ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతుల ఆసరా పింఛన్లు కూడా అప్పు కింద జమచేసుకుంటున్నారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..

పంటల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సదస్సులో ప్రభుత్వం కోరింది. అయినా ఈ విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాయి. రుణమాఫీ అయిన రైతులకు కూడా అప్పులు ఇచ్చేందుకు కొర్రీలు పెడుతున్నాయి. వడ్డీతో సహా పంట రుణం మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణాలిస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో రైతులకు నిరాశ తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని సకాలంలో పంట రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే 2018, అంతకు ముందు పలువురు రైతులు రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు అప్పు తీసుకున్నారు. అలాంటి వారికి ఇప్పుడు రూ.లక్ష మాఫీ అయినా.. అది వారి వడ్డీలకు కూడా సరిపోవడం లేదని బ్యాంకర్లు అంటున్నారు. అప్పు మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇవ్వడం సాధ్యమవుతుందని చెబుతున్నారు.

రుణమాఫీ అయినా కొత్త లోను ఇవ్వట్లే



రుణమాఫీలో పేరు వచ్చింది. మాఫీ అయిందని బ్యాంకుకు పోతే కొత్త లోన్ ఇవ్వటం లేదు. లోన్ మొత్తం కడితేనే కొత్త అప్పు ఇస్తామంటున్నారు. ఇప్పుడు పెట్టుబడులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. పాత లోన్ మొత్తం కట్టే పరిస్థితి లేదు. రుణమాఫీ అయిన డబ్బులు ఇచ్చినా పెట్టుబడులకు అక్కరకు వస్తాయి.

– రాసాల ముత్తయ్య, రైతు

పెట్టుబడులకు ఇబ్బందులే



బ్యాంకుల్లో రుణమాఫీ కాకపోవడంతో కొత్తలోన్ ఇవ్వటం లేదు. రుణమాఫీలో పేర్లు వస్తాయని ఎదురుచూస్తున్నాం. ఇప్పటి వరకు రుణమాఫీపై బ్యాంకులో ఏమీ చెప్పడం లేదు. పంటల సాగుకు పెట్టుబడి డబ్బులు లేకు ఇబ్బంది పడుతున్నాం. రుణమాఫీ వెంటనే అమలు చేసి వెంటనే కొత్త లోన్లు ఇవ్వాలి.

– యారం శేషిరెడ్డి, రైతు

క్లుప్తంగా

కెప్టెన్ జలగం రామారావు మృతి

మాజీ ముఖ్యమంత్రి వెంగళరావుకు సోదరుడు



జలగం రామారావు (ఫైల్)

సత్తుపల్లి: మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు జలగం రామారావు (94) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. నేవీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తించిన ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులకు సుపరిచితులు. ఆల్ ఇండియా వెలమ సంఘం అధ్యక్షుడిగా, పర్యావరణ సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అంకంపాలెం, పట్వారిగూడెంల్లో భూములు కోల్పోయిన గిరిజనుల పక్షాన పోరాడి తిరిగి ఇప్పించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు రామారావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కొండూరు సుధాకర్, మానవతారాయ్ తదితరులు రామారావు మృతిపై సంతాపం తెలిపారు.

నేటి నుంచి సింగరేణి క్రీడాపోటీలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో బుధవారం నుంచి కార్పొరేట్ ఏరియా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఇక్కడ పోటీల్లో రాణించే క్రీడాకారులను రీజియన్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఆ తర్వాత కంపెనీ స్థాయి, కోలిండియా స్థాయిలో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, పోటీల్లో భాగంగా తొలిరోజైన 20వ తేదీన క్యారమ్స్, చెస్ పోటీలు, ఈ నెల 21న వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, 22న బాల్ బ్యాడ్మింటన్, 23న కబడ్డీ, 24న షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ (మహిళలకు), 25న బాస్కెట్‌బాల్, 29న వాలీబాల్, 30న లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తారు. అలాగే, అక్టోబర్ 1న టేబుల్ టెన్నిస్, 6న త్రోబాల్, 7న టెన్నీకాయిట్, 9న క్రికెట్ పోటీలతో పాటు 13న అథ్లెటిక్స్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరితేనే నిధులు ఇస్తారట !



మాట్లాడుతున్న పార్వతి, రామారావు

చండ్రుగొండ: బీఆర్‌ఎస్‌లో చేరితేనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు షరతు విధించారని తిప్పనపల్లి సర్పంచ్ ధరావత్ పార్వతి, ఉపసర్పంచ్ ధరావత్ రామారావు ఆరోపించారు. గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలో చేరాలని అనేకసార్లు ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. మహాకూటమి అభ్యర్థిగా మెచ్చా గెలుపు కోసం కృషి చేయగా, అధికార పార్టీలో చేరాక తమపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ప్రభావిత జీపీ తిప్పనపల్లి అభివృద్ధికి నిధుల కోసం సింగరేణి అధికారులకు సిఫార్సు చేయాలని ఎమ్మెల్యే చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మచ్చా కుమార్, సయ్యద్ షఫీ, ఎస్డీ సలీం, ఎస్డీ నజ్మా, పసుపులేటి మంగయ్య, షబ్బీర్, సాంబయ్య, ప్రసాద్, హమీద్, బాజీ పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణం దగ్ధం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద ఆర్లగూడెంలోని రామకృష్ణ ఆగ్రో కెమి కల్స్ దుకాణం మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దుకాణ యజమాని శ్రీకాంత్ కథనం ప్రకారం.. దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి దుకాణంలోని పురుగుమందులు, సామగ్రి అంతా కాలిపోయిందని చెప్పాడు. సుమారు రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని ఆయన తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

దుమ్ముగూడెం: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా సీతారాంపురం నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. లక్ష్మీనగరం గ్రామ శివారులో మాటువేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించామని సీఐ దోమల రమేశ్ వెల్లడించారు.

లారీడ్రైవర్‌పై కేసు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో లారీడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగాపురం గ్రామ శివారు కిన్నెరసాని బ్రిడ్జివద్ద గత నెల 29వ తేదీన ఏపీ రాష్ట్రంలోని చింతూరు నుంచి కారేపల్లి మండలం చీమలపాడు గ్రామానికి బానోతు విజయ్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో విజయ్‌కు గాయాలయ్యాయి. మంగళవారం బాధితుడి ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ సైదాపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

కేసీఆర్ కానుక.. ఎప్పుడిక?



మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవించిన మహిళలు

- ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలకు అందించే నగదుకు లోటు
- జిల్లాలో రూ.13 కోట్లు పెండింగ్..
- రెండేళ్లుగా అదే దుస్థితి..

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రవేశపెట్టిన కేసీఆర్ కానుక అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటే కేసీఆర్ కిట్ పథకం వర్తింపజేస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ, నిధులు విడుదల చేయటంలో జాప్యం చేస్తున్నారు. దీంతో కాన్పు చేయించుకున్న తల్లులు తమకు వచ్చే డబ్బుల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అయినా, పాలకులు నిధులు విడుదల చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రెండేళ్లుగా జిల్లాలో 11,196 మందికి అందించాల్సిన కానుకకు సంబంధించి రూ.13 కోట్ల 43 లక్షల 52 వేలు పెండింగ్ పడిపోయాయి. జిల్లాలో 2022లో 8,681 మంది గాను రూ.10,04,17,200.. 2023లో 2,515 మందికి గాను రూ.3,03,80,000 కేసీఆర్ కానుకగా చెల్లించాల్సి ఉంది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ ప్రవేశ పెట్టింది. రెండు కాన్పుల వరకు మాత్రమే కేసీఆర్ కానుక వర్తిస్తుంది. అబ్బాయి పుడితే రూ.12 వేలు, అమ్మాయిలు పుడితే రూ.13 వేలు ఇస్తారు.

నగదు ఇలా..

కేసీఆర్ కిట్‌కు ఏఎన్‌సీ రిజిస్టర్ అయి.. పరీక్షలు చేయించుకున్న వారికి రూ.2 వేలు ఇస్తారు. రెండు సార్లు ప్రభుతాస్పత్రిలోపరీక్షలు చేయించుకున్న వారికి రూ.3 వేలు, ప్రసవం తర్వాత అబ్బాయి పుడితే రూ.4 వేలు, అమ్మాయి పుడితే రూ.5 వేలు అందిస్తారు. పుట్టిన పిల్లలకు ఇమ్యునైజేషన్ పూర్తి అయిన తరువాత రూ.2 వేలు, ఐదేళ్ల టీకాలు పూర్తయిన తరువాత రూ.3 వేలు ఇస్తారు.

జిల్లాలో ఈ ఏడాది 5,369 కాన్పులు

జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆస్పత్రిలో 2,288 కాన్పులు జరిగాయి. అలాగే, భద్రాచలం ఆస్పత్రిలో 1,755, పాల్వంచ సీహెచ్‌సీలో 603, మణుగూర్ సీహెచ్‌సీలో 360, ఇల్లెందు సీహెచ్‌సీలో 255, అశ్వారావుపేట సీహెచ్‌సీలో 97, బూర్గంపాడు సీహెచ్‌సీలో 11 కాన్పులు అవగా మొత్తం జిల్లాలోని ఆస్పత్రుల్లో 5,369 ప్రసవాలు జరిగాయి. అందులో 2,515 మందిని కేసీఆర్ కిట్‌కు అర్హులుగా ప్రకటించారు. మిగతా వారు మూడో కాన్పునకు చెందిన వారు కావటంతో అనర్హులయ్యారు.

కచ్చితంగా వస్తాయి..



కేసీఆర్ కిట్ పథకంలో ఉన్న వారికి డబ్బులు కచ్చితంగా వారి ఖాతాలో జమ అవుతాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వారి ఖాతాల్లో నేరుగా జమవుతాయి. వచ్చే రెండు నెలల్లో బకాయిలు విడుదలవుతాయి. అప్పుడు వారి ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

– చైతన్య, మాతా శిశు సంరక్షణ అధికారి

గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు



శిక్షణ పొందుతున్న వారితో కలెక్టర్ ప్రియాంక, పీఓ ప్రతీక్, ఏఎస్పీ పరితోష్

- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు
- ఐటీడీఏ సమీక్షలో జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం: గిరిజన గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య శిబిరాల ఏర్పాటుపై దృష్టి సారించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీఓ ప్రతీక్ జైన్‌తో కలిసి మంగళవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని, విషజ్వరాలు వ్యాపించకుండా, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే, 102, 108 వాహనాలు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేని గ్రామాల జాబితాను అందజేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఇంకా తాగునీటి సౌకర్యం లేని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ స్థలం లేని 15 గ్రామాల్లో జీపీ భవన నిర్మాణాలకు అటవీ శాఖ ద్వారా స్థల సేకరణ చేపట్టాలని, ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో డిజిటల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆ తర్వాత ట్రైకార్, ఎంఎస్ఎంఈ ఋణాలు, హస్త కళారూపాల మార్కెటింగ్ అంశాలపై చర్చించిన కలెక్టర్.. ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ కేంద్రాన్ని పరిశీలించి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. సమావేశంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, సహకార అధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ శిరీష, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్ఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బుగూడెంలో వ్యక్తి మృతి

- కేసు బనాయించడంతోనే మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- కారణమైన బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటి వద్ద మృతదేహంతో నిరసన

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో సోమవారం వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. అబ్బుగూడెంనకు చెందిన బూరుగు శ్రీనివాసరావు (33) అలియాస్ లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పురుగుమందు పిచికారి చేయడానికి వెళ్లాడు. అనంతరం పొలంలోని మోటారు వద్ద ముఖం, చేతులు కడుక్కొని అక్కడే కుప్పకూలాడు. మరో కూలి ఆర్ఎంపీకి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. లక్ష్మయ్య మృతికి స్థానిక బీఆర్ఎస్ నాయకుడే కారణమని.. మృతుడి బంధువులు మృతదేహంతో సదరు నాయకుడి ఇంటి వద్ద నిరసనకు దిగారు.

నగదు విషయంలో తగాదా..

ఈ నెల 14న శ్రీనివాసరావు తన బంధువుతో కలిసి బెల్ట్‌షాప్‌లో మద్యం సేవించాడు. డబ్బుల విషయంలో దుకాణంవారికి శ్రీనివాసరావుకు మధ్య గొడవ జరిగింది. ఈ విషయం చెప్పేందుకు పక్కనే ఉన్న బీఆర్ఎస్ నాయకుడి ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ నాయకుడికి, శ్రీనివాసరావుకు మధ్య గొడవ జరగింది. ఆ నాయకుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చేసరికే శ్రీనివాసరావు వెళ్లిపోయాడు. ఆదివారం శ్రీనివాసరావు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. కేసు నమోదైందని, కోర్టుకు హాజరు కావాలని ఎస్ఐ చెప్పి పంపించారు. సోమవారం శ్రీనివాసరావు మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకుడు పోలీసుల ద్వారా భయాందోళనకు గురిచేయడం వలనే మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు, బంధు వులు ఆరోపించారు. మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకుడి ఇంటి వద్ద ఉంచి రెండు గంటల పాటు నిరసన తెలిపారు. పోలీసులు గ్రామానికి చేరుకొని మృతుడి బంధువులతో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తగూడెం తరలించారు. మంగళవారం మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అంజయ్య ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి దారుణ హత్య

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలోని అటవీ ప్రాంతంలో బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన రైతు మారుతి శ్రీనివాస్ (35) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సాయంత్రం పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన శ్రీనివాస్ రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కంగారుపడి స్థానికుల సాయంతో చేనువద్దకు వెళ్లారు. మార్గమధ్యలో జామాయిల్‌తోటలో బైక్ కింద పడి ఉండటం.. పక్కనే రక్తం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రమణమూర్తి, సీఐ కరుణాకర్ సిబ్బందితో సహా ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాస్ ఆచూకీ కోసం సమీపంలో వెతకడంతో చెట్ల పొదల్లో అతడి మృతదేహం లభించింది. తలపై బలమైన గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు హత్య జరిగినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



వీరకృష్ణ (ఫైల్)

సుజాతనగర్: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానిక గోధుమవాగు వంతెన సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన ఎనుముల వీరకృష్ణ (25) సెంట్రింగ్, తాపీ పనులు చేస్తుంటాడు. సుజాతనగర్‌లోని ఓ వెంచర్లో పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఏదో పని ఉందంటూ కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా గోధుమవాగు వంతెన పక్కన మూలమలుపు వద్దకు రాగానే అదుపుతప్పి లోయలో పడిపోయాడు. రాయికి తల బలంగా గుద్దుకోవడంతో మెదడు బయటకు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలోని వంతెన నిర్మాణం ఇటీవలే పూర్తయింది. ఇక్కడ పెద్ద మూలమలుపు ఉండగా ఎలాంటి రెయిలింగ్ కానీ మూలమలుపు అని తెలిపే సిగ్నల్స్‌ను కానీ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కాగా, వెంకన్న, వెంకటరమణ దంపతులకు వీరకృష్ణతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో ఇతనే కుటుంబానికి ఆధారం. ఇద్దరు సోదరీమణులకు వివాహం కాగా తాను అవివాహితుడు. యువకుడి మరణంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతి

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతిచెందిన ఘటన మంగళవారం చుంచుపల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. సర్వారం పంచాయతీకి చెందిన బానోత్ బాలు (51) ద్విచక్రవాహనంపై ఊర్లు తిరుగుతూ పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పండ్లు అమ్ముకుంటూ పెనగడపకు బయలుదేరాడు. మార్గమధ్యలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం ఉంటే భోజనం చేసేందుకు వెళ్తున్నాడు. అయితే, ఆ మార్గంలో వెళ్లొద్దని సింగరేణి అధికారులు బోర్డు పెట్టడంతో ద్విచక్రవాహనాన్ని జాతీయ రహదారిపైకి పోనిచ్చాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో బాలు అక్కడికక్కడే మృతి చెందాడని సీఐ రమేశ్ తెలిపారు. కారు నడిపిన వ్యక్తి కారును అక్కడే వదిలి పరారయ్యాడని ఆయన వివరించారు.

పుట్టినరోజు నాడే అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



షారుఖ్ (ఫైల్)

ఇల్లెందురూరల్: అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తమ ఏకైన కుమారుడి జన్మదినం కావడంతో ఆ ఇంట పండుగ వాతావరణం నెలకొంది. తెల్లవారితే చిన్నారి పుట్టినరోజు కోసం వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు తమకు ఉన్నంతలో ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో దూసుకొచ్చిన మృత్యువు చిన్నారిని బలిగొన్న ఘటన ఇల్లెందు మండలం సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ తండాలో మంగళవారం తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన జమాల్, హసీనా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ ఏకైక కుమారుడు షారుఖ్(5).. రహదారి పక్కనే ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని చూసేందుకు ఇతర పిల్లలతో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా లచ్చగూడెం గ్రామానికి చెందిన రమేష్ బుల్లెట్ వాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి షారుఖ్ మంగళవారం మృతిచెందాడు. కాగా, మంగళవారమే చిన్నారి పుట్టినరోజు. దీంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిన ప్రమాదం

- పైప్‌లైన్ పగలడంతో ఎగిరిపడిన సీసీ రోడ్డు పెచ్చులు
- షాపులు, మార్కెట్‌ను ముంచెత్తిన వరద



పైప్‌లైన్‌ను పగిలిన ప్రాంతంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, తదితరులు

ఇల్లెందు: అందరూ వినాయకచవితి పూజలో నిమగ్నమైన వేళ సోమవారం సాయంత్రం 4 గంటలకు ఇల్లెందు అంబజార్ మీదుగా వెళ్లే 12 అంగుళాల మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ పగిలింది. దీంతో సీసీ రోడ్డు పెచ్చులు పగిలి మూడు మీటర్ల ఎత్తుకు ఎగిరిపడగా.. ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక పైపులైన్ పగలడంతో నీరు రోడ్డు వెంట షాపుల్లోకి చేరడమే కాక సమీపంలోని కూరగాయల మార్కెట్‌ను ముంచెత్తింది. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో పాటు సీఐ కరుణాకర్, వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్ పాబోలు స్వాతి చేరుకుని భగీరథ ఎస్ఈకి ఫోన్ చేశారు. ఆ వెంటనే సిబ్బంది మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. కాగా, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రహదారిపై వరద పారింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో చిన్న సైడ్ కాల్వ ఉండగా, ఆంబజార్ రోడ్డు విస్తరణలో భాగంగా పెద్ద డ్రెయినేజీ నిర్మించారు. దీంతో పైపులైన్ పగలగానే వరద డ్రెయినేజీలో చేరడంతో షాపుల్లో భారీగా నీరు చేరక ప్రమాదం తప్పినట్లయింది. కాగా, పైపులైన్‌ను పరిశీలించిన వారిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.కే.జానీ, ఎన్.శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారీ, ఘాజీ, గిన్నారపు రాజేశ్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం నిల్వచేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: కోళ్ల ఫారంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగారం రోడ్డులోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పల్లపు శ్రీనివాసరావు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. ఈ నెల 13న సివిల్ సప్లై డీటీ కృష్ణ దాడి చేసి పట్టుకున్నారు. ఈ ఘటనలో మంగళవారం శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

చికిత్స పొందుతున్న లారీడ్రైవర్ మృతి

పాల్వంచరూరల్: మద్యం మత్తులో పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లారీడ్రైవర్ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బస్వతారకకాలనీ పంచాయతీలోని సీతానగర్‌కాలనీకి చెందిన లారీడ్రైవర్ తోట కొమరయ్య (37) మద్యానికి బానిసై ఈ నెల 11వ తేదీన ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుమందు తాగాడు. చుట్టుపక్కలవారు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

జగన్నాథపురంలో చికిత్స పొందుతున్న వ్యక్తి..

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జగన్నాథపురం గ్రామానికి చెందిన భద్రం (47) శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన భద్రంను కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి...

పాల్వంచ: ఆర్థిక, అనారోగ్య సమస్యల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సంపెట గణేశ్‌బాబు(57) కొత్తగూడెం కోర్టులో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా షుగర్ వ్యాధి వల్ల ఇబ్బంది పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 17న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య శారద, కొడుకు వెంకటకార్తీక్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట: పురుగులమందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గండుగులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గండుగులపల్లికి చెందిన సోయం రాజు(30) సోమవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి భార్య మంగతాయారు.. మృతుడి సోదరులకు తెలిపింది. అయితే, సోయం రాజు.. అతడి భార్య మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని, మృతుడి సోదరుడు సోయం రాంబాబు తెలిపాడు. తన సోదరుడి మృతిపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

టేకులపల్లి: ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. భద్రాచలం ఏఎస్ఆర్‌కాలనీకి చెందిన టీవీ మెకానిక్ ముత్యాల దుర్గాప్రసాద్ ఈ నెల 12న రాత్రి భద్రాచలం నుంచి టేకులపల్లి మీదుగా బైక్‌పై ఖమ్మం బయలుదేరాడు. తొమ్మిదోమైలుతండా సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ని దాటి వెళ్లేందుకు ప్రయత్నించాడు. కానీ, ట్రాక్టర్ అకస్మాత్తుగా బైక్‌కు అడ్డువచ్చింది. ట్రాక్టర్ వెనుక భాగం తగలడంతో దుర్గాప్రసాద్ గాయపడ్డాడు. స్థానికుడు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బొగ్గు పట్టివేత

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా నుంచి బొగ్గును తరలిస్తున్న రైలు మహబూబాబాద్ రైల్వే గేట్ వద్ద ఆగి ఉండగా వ్యాగన్ నుంచి సుమారు 5 టన్నుల బొగ్గును కిందకు దించి బస్తాల్లో నింపి బొలేరో వాహనం ద్వారా తరలించే క్రమంలో సెక్యూరిటీ అధికారులు పట్టుకున్నారు. కొంతకాలంగా ఇటుక బట్టీల కోసం సింగరేణి బొగ్గును చోరీ చేస్తున్నారు. రైల్వే వ్యాగన్ ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బొగ్గును దుండగులు కిందకు దించి తరలించే క్రమంలో సెక్యూరిటీ విభాగం అధికారులు పట్టుకున్నారు. బొగ్గు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తెలిపారు. ఆయన ఆదేశానుసారం సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.